అర్హులైన ప్రతీ లబ్ధిదారుడికి రేషన్ బియ్యం: అదనపు కలెక్టర్

ప్రజాపక్షం/జడ్చర్ల: జడ్చర్ల పట్టణంలోని మదీనా కాలనీలో గల చౌకధర దుకాణాన్ని రెవెన్యూ అదనపు కలెక్టర్ జెఎల్‌బి. హరిప్రియ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జడ్చర్ల తాహశీల్దార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ, డీటీతో కలిసి చౌకధర దుకాణం నెంబర్ 1423001 ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రేషన్ దుకాణంలో బియ్యం నిల్వలు, పంపిణీ ప్రక్రియ, రికార్డులను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న బియ్యం అర్హులైన ప్రతీ లబ్ధిదారుడికి సక్రమంగా, పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రేషన్ పంపిణీలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీలో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆమె ఆదేశించారు. అదే విధంగా సరైన సమయంలో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. ఎక్కడైనా ఇలాంటి అవకతకవలు జరిగిన సహించేది లేదని ఆమె కఠినంగా హెచ్చరించారు. ఈ తనిఖీలో జడ్చర్ల తాహసీల్దార్ నర్సింగరావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ, డీటీ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల్ : గద్వాల్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీ సమీపంలో పేకాట స్థావరంపై బుధవారం గద్వాల టౌన్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడులో ముగ్గురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.7,500 నగదు, మూడు సెల్‌ఫోన్‌లు, రెండు బైక్‌లు, పేకాట ముక్కలు, స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కల్యాణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

ప్రజాపక్షం/కల్వకుర్తి: మండలంలోని దాసర్లపల్లి గ్రామ శివారు నుంచి తెల్లవారు జామున అక్రమంగా, ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను రఘుపతిపేట గ్రామ శివారులో కల్వకుర్తి పోలీసులు పట్టుకోవడం జరిగిందని ఎస్ఐ కురుమూర్తి తెలిపారు. టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

ప్రపంచ ఫొటో గ్రఫీ దినోత్సవ వేడుకలు

ప్రజాపక్షం/పెద్దకొత్తపలి: మండల కేంద్రంలో డా.బి.ఆర్.అంబేద్కర్ బస్టాండ్ చౌరస్తాలో ఎండి జాంగిర్, కొల్లే ఈశ్వర్, ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటో గ్రఫీ దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఫొటో గ్రఫీ సృష్టికర్త లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కేక్ కట్ చేసి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫొటో గ్రాఫర్ అధ్యక్షులు మిత్ర రాజు, సతీష్, జంగిర్, ఖాసీం లింగం, కొల్లే ఈశ్వర్, మధు, రాజు, గిరి, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం

ప్రజాపక్షం/మక్తల్: నారాయణపేట్ జిల్లా మక్తల్ మండలంలోని మంతన్ గౌడ్, గుడిగండ్ల కాట్రపల్లి గ్రామాల్లో 4 ఇందిరమ్మ ఇండ్లను మంత్రి వాకిటి శ్రీహరి సోదరుడు వాకిటి శేషగిరి గృహ ప్రవేశాలకు హాజరై యజమానులకు శుభాకాంక్షలు తెలిపి మంత్రి వాకిటి శ్రీహరి తరపున కానుక అందజేశారు. అనంతరం దాదన్ పల్లి గ్రామంలో జరిగిన వివాహ మహోత్సవానికి హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వాకిటి శేషగిరి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి కాంగ్రెస్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం 5 లక్షల రూపాయలు ఉచితంగా అందజేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ , సర్పంచ్ రాజేందర్ గౌడ్, కావాలి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు భవనాలలో ప్రభుత్వ పాలన



ప్రజాపక్షం/చిన్నంబావి: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని బిజెపి రాష్ట్ర నాయకుడు కురువ మల్లయ్య, నాగర్ కర్నూల్ జిల్లా జనరల్ సెక్రటరీ జగ్గారి శ్రీధర్ రెడ్డి, మండల అధ్యక్షుడు బొగ్గ కురుమయ్య, విమర్శించారు. అధికారంలోకి వచ్చి కాలం గడుస్తున్నా ప్రజల సమస్యలు పరిష్కారం కాలేదని, హామీల అమలుపై ప్రశ్నిస్తే ప్రభుత్వం దాటవేత ధోరణి అవలంబిస్తోందని ఆరోపించారు. బుధవారం చిన్నంబావి మండల కేంద్రంలోని బిజెపి పార్టీ మండల అధ్యక్షులు బొగ్గ కురుమయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బిజెపి రాష్ట్ర నాయకుడు కురువ మల్లయ్య మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ప్రజలను ఆకట్టుకునేందుకు పరిమితమయ్యాయని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500 వికలాంగులకు రూ.6 వేలు, వితంతువులు, ఒంటరి మహిళలకు పెంచిన ఫించన్లు, రైతుబంధు పెంపు, రూ.500 కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడితే రాబోయే రోజుల్లో ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన సమాధానం ఎదురవుతుందని హెచ్చరించారు. లేకపోతే గ్రామగ్రామాన ప్రజలను కలుపుకొని ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని బిజెపి నేతలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి మేకల చెన్నయ్య యాదవ్, కావలి గోపాల్ నాయుడు, బీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి జింకల కిరణ్‌తో పాటు పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ప్రజాపక్షం/కల్వకుర్తి : మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం కల్వకుర్తి మండలంలోని తర్నికల్, తుర్కలపల్లి, పంజుగుల గ్రామాలలో నూతనంగా నిర్మించిన మహిళా సంఘాల భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అదే విధంగా పంజుగుల గ్రామంలో రూ.30 లక్షలతో గ్రామ ఫుడ్ గ్రెయిన్ స్టోరేజ్ భవన నిర్మాణం, ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనం నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. తర్నికల్ నుండి శ్రీరామ్ నగర్ వరకు రూ.3.20 కోట్ల వ్యయంతో బిటి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తూ ఆర్థికంగా రాణించాలని ప్రభుత్వం వారిని ప్రోత్సహిస్తుందని తెలిపారు. మహిళా సంఘాలకు ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు తదితర అవకాశాలు కల్పిస్తూ మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. గ్రామాల అభివృద్ధికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పంజుగుల, తుర్కలపల్లి గ్రామాల మధ్య నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. పనులు త్వరగా చేపట్టాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కల్వకుర్తి పట్టణ సమీపంలో ఉన్న కెఎల్ఐ కాలువలలో పారుతున్న కృష్ణా జలాలను ఎమ్మెల్యే నారాయణరెడ్డి పరిశీలించి ఆనందం వ్యక్తం చేశారు. కాలువల వెంట కృష్ణా జలాలు రావడంతో రైతులు పంటలు సాగు చేసుకునేందుకు ఎంతో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో తర్నికల్, తుర్కలపల్లి, పంజుగుల గ్రామాల సర్పంచ్‌లు చెన్‌రెడ్డి వరలక్ష్మి, పవన్ కుమార్ రెడ్డి, వంగూరి లతా శేఖర్ రెడ్డి, పరుశురాములు, మాజీ జడ్పీటీసీ అశోక్ రెడ్డి, కల్వకుర్తి మాజీ సర్పంచు ఆనంద్ కుమార్, పిఆర్‌డిఈ బసవ లింగం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్‌కుమార్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బాల్‌రెడ్డి, నాయకులు సంజీవ్ కుమార్ యాదవ్, వివిధ గ్రామాల సర్పంచులు, మార్కెట్ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందించాలి

ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

ప్రజాపక్షం/అలంపూర్: జోగులాంబ గద్వాల్ జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని బిఆర్ఎస్ పార్టీ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అధికారులను కోరారు. ఈ మేరకు జిల్లా నీటి పారుదల శాఖ సిఇ రహిముద్దీన్‌తో ఎమ్మెల్సీ బుధవారం చరవాణిలో మాట్లాడారు. జూరాల లింక్ కెనాల్ ద్వారా అలంపూర్ నియోజకవర్గంలోని వివిధ మండలాల్లోని చెరువులు, కాలువలకు, వెంటనే నీటిని విడుదల చేయాలని ఆయన కోరారు. అలాగే నెట్టెంపాడు ప్రాజెక్టు 99వ ప్యాకేజీలో పెండింగులో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి ఆయకట్టుకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 106వ ప్యాకేజీ పరిధిలో చివరి ఆయకట్టు ప్రాంతాలైన ఇటిక్యాల మండలంలోని గ్రామాలకు కూడా నీరు అందేలా చూడాలని కోరారు. జూరాల లింక్ కెనా ల్ పరిధిలోని ఆయకట్టు ప్రాంతాలకు నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టాలని, రైతులకు సాగునీటి విషయంలో పూర్తి భరోసా కల్పించాలని ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి అధికారులను కోరారు.

బ్రిడ్జి పనులు పరిశీలించిన మంత్రి

ప్రజాపక్షం/ఉట్కూర్: రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి మండలంలోని పెద్ద పొర్ల గ్రామంలోని రూ.2 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా బ్రిడ్జి నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నందుకు గ్రామ సర్పంచ్ బోయిన్‌పల్లి కాశమ్మ మంత్రి వాకిటి శ్రీహరి కి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గ్రామంలోని పలు ప్రధాన సమస్యలను వినతిపత్రం ద్వారా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ సమస్యలపై మంతిత్రి సానుకూలంగా స్పందించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు వివిధ గ్రామాల సర్పంచ్‌లు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆహార భద్రత పథకాల అమలులో లోపాలకు తావివ్వొద్దు

అర్హులైన ప్రతీ లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందాలి

ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్: ఆహార భద్రత పథకాల అమలులో లోపాలకు తావివ్వొద్దని, అర్హులైన ప్రతీ లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందాలని ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ కలెక్టర్‌రేట్‌లో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధ్యక్షతన జిల్లా అధికారులతో ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, ఫుడ్ కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్, రంగినేని శారదలతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో చేరేలా చూడటం అధికారుల బాధ్యత అన్నారు. ఆహార భద్రతకు సంబంధించిన పథకాల అమలులో ఎలాంటి లోపాలకు తావులేకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రతి విద్యార్థికి హెల్త్ ప్రొఫైల్ అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ లబ్ధిదారులకు అందుతున్న బియ్యం, ఇతర నిత్యావసర సరుకుల పంపిణీని అధికారులు క్రమం తప్పకుండా పరిశీలించాలని అన్నారు. రేషన్ దుకాణాల్లో సరుకుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు పంపిణీ వివరాలు, లబ్ధిదారుల జాబితాలకు తనిఖీ చేయాలని సూచించారు. కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ఫుడ్ కమిషన్ చైర్మన్, సభ్యులు క్షేత్రస్థాయి పర్యటనలో గుర్తించిన అంశాలను పరిగణనలోకి తీసుకుని అవసరమైన చర్యలు చేపడతామని చెప్పారు. కల్వకుర్తి పర్యటనలో కమిషన్ చైర్మన్, సభ్యులు గుర్తించిన లోటుపాట్లపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న గుడ్లు నాణ్యత, సరైన బరువు లేకపోవడంపై అధికారులు స్పందించి, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా గుడ్లను సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.చెన్నయ్య, దేవసహాయం, డిఆర్‌డిఎ పిడి చిన్న ఓబులేష్, కూన స్కైలాబ్ పాల్గొన్నారు.

యథాస్థితిలోనే ప్రభుత్వ జూనియర్ కళాశాలలు

నూతన భవన నిర్మాణం కోసం తాత్కాలిక తరలింపు చేపట్టాలి

మానవ హక్కుల సంఘం కార్యకర్త మద్దిలేటి

ప్రజాపక్షం/మక్తల్: మక్తల్ పట్టణ కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్తిగా శిథిలాస్థలోకి చేరిందని, కనీసం మూత్రశాలలు లేని పరిస్థితుల్లో 600 మంది విద్యార్థులు కళాశాలలో చదువుకుంటున్నారని మానవ హక్కుల సంఘం కార్యకర్త మద్దిలేటి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల చదువుపై పాలకుల నిర్లక్ష్య వైఖరి వీడి నూతన భవనం నిర్మాణం చేయడంతో పాటు కళాశాల భూములను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఎన్నో ఏళ్లుగా లక్షలాది మంది విద్యార్థులు ఇందులో చదువుకోని ఎంతోమంది ఉన్నతస్థానంలో ఉండడమే కాకుండా అన్ని రంగాల్లో కూడా విస్తరించారని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతన భవనం నిర్మించి ఇవ్వాలని చాలా కాలంగా ప్రజలు, ప్రజా సంఘాల డిమాండ్ కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో కోట్లాది రూపాయల విలువచేసే ప్రభుత్వ జూనియర్ కళాశాల భూములపై అనేక మంది కన్నుమూశారని వారికి వత్తాసుగా పాలకవర్గాలు, అధికారులు భూముల పరిరక్షణపై నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తున్నాయని ఎద్దేవ చేశారు. ప్రభుత్వం జూనియర్ కళాశాలను అక్కడి నుండి శాశ్వతంగా తొలగించి ఆప్రాంతాన్ని మొత్తం క్రీడామైదానంగా మారుస్తామని ప్రజా ప్రతినిధులు చెబుతూ వస్తున్నారు. కానీ ఇది ముమ్మాటికి పేద విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగించడమే తప్ప మరొకటి కాదన్నారు. పేదల చదువుపై ఏమాత్రం ప్రేమ ఉన్న పాలకవర్గాలు యథాస్థితిలో భవన నిర్మాణాన్ని కొనసాగించి, తాత్కాలిక వెసులుబాటు కోసం తరలించాలని తెలియజేశారు. చదువుల తర్వాతే ఆటలు, చదువులు లేని ఆటలు మనిషి అభ్యున్నతికి ఉపయోగపడవని ఈ విషయాన్ని పాలకులు గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. కావున క్రీడా మైదానం కంటే కూడా నూతన కళాశాల విశాల గదులు, ప్రశాంత వాతావరణము సకల సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా నిధులు మంజూరు చేసి యథాస్థితిలోనే నూతన భవన నిర్మాణం చేపట్టాలని కోరారు. కోట్ల విలువచేసే కళాశాల భూములను కబ్జాదారుల నుంచి కాపాడుతూ, కళాశాలను తరలించే ప్రక్రియ వెంటనే మానుకోకపోతే విస్తృత ప్రజా విద్యార్థి ఉద్యమాల ద్వారా కళాశాలను, కళాశాల భూములను కాపాడుకుంటామని హెచ్చరించారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రజాపక్షం/కృష్ణ: తెలంగాణ ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత ఆధునీకరిస్తూ రాష్ట్రవ్యాప్తంగా డెబిట్, ఎటిఎం కార్డు తరహాలో అత్యాధునిక స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించింది. ఇందులో భాగంగా కృష్ణ మండల పరిధిలోని మూడుమాల్ గ్రామంలో మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు సర్పంచ్ బాలరాజు, కాంగ్రెస్ నాయకులు కాడ్రు తమ్మప్ప, గడుగు వెంకటేష్, ఆధ్వర్యంలో లబ్ధిదారులకు డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టండి

ప్రజాపక్షం/వంగూరు: మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామం నుండి వంగూర్, ఉల్లంపల్లి నుండి వంగూరు, గాజర నుండి తిప్పారెడ్డిపల్లి అడ్డరోడ్ వరకు ఉన్న మట్టిరోడ్డు మరమ్మత్తులు చేపట్టి వాహనదారుల ప్రమాదాలను అరికట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. నిత్యం వందల సంఖ్యలో మండల కేంద్రానికి వెళుతున్న వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే స్పందించి ఈ గ్రామాలలో ఉన్న మట్టి రోడ్లను తొలగించి బిటి రోడ్డుగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఎఐటియుసి పోరాట ఫలితమే..

కార్మికులకు కీలక హక్కుల సాధన

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్: తెలంగాణ మున్సిపల్ స్టాఫ్, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో నిర్వహించిన నిరంతర పోరాటాల ఫలితంగా మున్సిపల్ కార్మికులకు కీలక హక్కులు సాధించబడ్డాయని ఎఐటియుసి నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ తెలిపారు. కార్మికులకు క్యాజువల్ లీవులు, పండుగ సెలవులు, వీక్లీ ఆఫ్‌లు, ఇఎస్ఐ, పిఎఫ్‌తో పాటు ఇతర చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేయడం కార్మిక ఉద్యమ విజయమని ఆయన పేర్కొన్నారు. ఈ విజయం పూర్తిగా కార్మికుల ఐక్యతకు, ఏఐటీయూసీ చేపట్టిన ఉద్యమాలకు దక్కిన ఫలితమన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎఐటియుసి నిరంతరం పోరాడుతూ, అధికారులపై సంబంధిత ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తీసుకురావడం వల్లే ఈ హక్కులు సాధ్యమయ్యాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఎఐటియుసి మరింత బలంగా పోరాటాలు కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

ఘనంగా ప్రపంచ ఫొటో గ్రఫీ దినోత్సవం

ప్రజాపక్షం/పానుగల్: పానుగల్ మండల కేంద్రంలో బుధవారం ప్రపంచ ఫోటో గ్రఫీ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్ర పంచ ఫొటో గ్రఫీ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా దగ్గర మండల ఫోటో గ్రాఫర్స్ ఆధ్వర్యంలో లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగింది. అదే విధంగా రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కేతేపల్లి సీనియర్ ఫోటోగ్రాఫర్ గోపన్ గౌడ్, అధ్యక్షులు కమలాకర్, ఉపాధ్యక్షులు కేతూరి రవి, కార్యదర్శి మన్యం, ప్రచార కార్యదర్శి యాదగిరి, కేతేపల్లి సీనియర్ పొటోగ్రాఫర్ గిరి, మిద్దె నరేష్, ఎండి నిరంజన్, గోపి, మహేష్, శంకర్, మల్లికార్జున్, శ్రీరామ్, రిషి, స్వామి పాల్గొన్నారు.

పేట ప్రజల ఆశలకు... పర్ణిక పథం

యువ ఎమ్మెల్యేగా అడుగులు.... అభివృద్ధి కోసం పరుగులు

పల్లె నుంచి పట్టణం వరకు ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి

ప్రజాపక్షం/నారాయణపేట: ఒకవైపు రాజకీయ వారసత్వం.... మరోవైపు యువతరం ఆకాంక్షలు.. ఇంకో వైపు వెనుకబడిన ప్రాంతంగా ఉన్న నారాయణపేట అభివృద్ధి సవాళ్లు... వీటన్నింటి మధ్య ప్రజా ప్రతినిధిగా తనదైన ముద్ర వేసేందుకు అడుగులు వేస్తున్న యువ నాయకురాలు డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి ఆగస్టు 20న రాజకీయ ప్రస్థానం, అభివృద్ధి పై ప్రజల ఆశలు చర్చనీయాంశంగా మారాయి. యువతకు ప్రతినిధిగా... 2023 అసెంబ్లీ ఎన్నికల్లో నారాయణపేట నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించిన పర్ణికా రెడ్డికి ఇది తొలి శాసనసభ ప్రస్థానం వైద్య విద్యను అభ్యసించిన ఆమె రాజకీయాల్లోకి అడుగుపెట్టి ప్రజా సమస్యలను అసెంబ్లీ వేదికగా ప్రస్తావించే బాధ్యతను స్వీకరించారు. నారాయణపేట నియోజకవర్గానికి సాగునీరు, రహదారులు, విద్య, వైద్యం, ఉపాధి వంటి అంశాలు అత్యంత కీలకం. ముఖ్యంగా మక్తల్ నారాయణపేట్‌కొడంగల్ ఎత్తిపోతల పథకం పూర్తయితే ఈ ప్రాంత వ్యవసాయ రంగానికి ఊతం లభించే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు ప్రభుత్వం నిధులు కేటాయించి పనులను ముందుకు తీసుకెళ్లే దిశగా చర్యలు చేపడుతోంది. నారాయణపేటలో వైద్య కళాశాల, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలు కూడా నియోజకవర్గ భవిష్యత్తులో కీలకంగా మారుతున్నాయి. గతంలో జిల్లాలో వందల కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిగాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు, పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు, గ్రామీణ రహదారుల అభివృద్ధి, తాగునీటి సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ప్రజలు మరింత దృష్టిని కోరుకుంటున్నారు. మహిళా సాధికారతను ప్రాధాన్యం గ్రామీణ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు, స్వయం సహాయక సంఘాల బలోపేతం, మహిళా సంఘాలకు రుణ సదుపాయాలు కల్పించడం వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. కొడంగల్ నియోజకవర్గంలో మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల ద్వారా పెద్ద ఎత్తున మద్దతు అందించినట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. పుట్టినరోజులు ప్రతీ ఏడాది వస్తాయి... కానీ ప్రజాప్రతినిధి పదవీకాలం మాత్రం చరిత్రలో ఒక అధ్యాయం. అందుకే పర్ణికా రెడ్డి ముందున్న అసలు సవాలు నారాయణపేటను అభివృద్ధి పథంలో ఎంత దూరం తీసుకెళ్లగలరు? అన్నదే ప్రశ్న. ఆగస్టు 20న ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి జన్మదినం సందర్భంగా అభిమానులు, కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు శుభాకాంక్షలు తెలపడానికి సిద్ధమవుతున్నారు. అయితే ఈ జన్మదినం కేవలం వేడుకలకే పరిమితం కాకుండా నియోజకవర్గ అభివృద్ధికి కొత్త లక్ష్యాలను నిర్దేశించుకునే సందర్భంగా మారాలని ప్రజలు కోరుకుంటున్నారు. పుట్టినరోజు శుభాకాంక్షల కంటే... ప్రజల జీవితాల్లో కనిపించే అభివృద్ధే నిజమైన బహుమతి.

శాశ్వత పరిష్కారం దిశగా కొత్తకోట మార్కెట్

ప్రజాపక్షం/కొత్తకోట: కొత్తకోట పట్టణంలో ఎన్నో సంవత్సరాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో మార్కెట్